వ్యాపారము

ఉదయము పదకొండు గంటలవేళ రంగు కళ్ళద్దాలు ధరించి మ. స. క. అంటే మల్లాప్రగడ సత్య కనకలింగేశ్వర్రావు పెద్ద పెద్ద అంగలువేస్తూ హరిజన వాడకు బయలుదేరాడు. కాకిరంగు పంట్లోను గళ్ళ బుష్‌కోటు అతడి గంభీరా కృతికి అందాన్ని చేకూర్చాయి. ఒకచేతికి కేమెరా తగిలించుకొని, మరొకచేత్తో తోలుసంచీ పట్టుకొని ఊపుతూ పెద్దపెద్ద అంగలువేస్తూ నడుస్తున్నాడు.

ఒక ఫర్లాంగు దూరాన పోలేరమ్మగుడి దగ్గర గూడేనికి పెద్దయిన వీరన్న నలుగురిని చుట్టూచేర్చికొని ఏదో మాట్లాడుతున్నాడు; అందరూ తలలూపుతున్నారు. మ. స. క. కు అరోజయినా తనపని సానుకూలమయితే బాగుండు ననిపించింది.

అతడు ఆ గూడేనికి వెళ్ళటము ఇది మూడవసారి. వెన్ను కంటుకొని పోయిన కడుపులతో- తడబడుతున్న పాదాలతో- కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్న నిరుపేద స్త్రీ పురుషులను, తల్లి పాలకొరకు అక్కటిల్లిపోయే పసిబిడ్డకు మంచినీటి చుక్కలతో గొంతు తడుపుతూ కన్నీళ్ళుకార్చే మాతృమూర్తు లను ఫోటో తీయాలని అతడి సంకల్పము, సూర్యచంద్రులు నిరాటంకముగా జొర బడగల గుడిసెలవి. దుమ్ములో పొరలాడుతూ అర్ధనగ్నముగా తిరుగుతూ తలి దండ్రుల చేతిక్రింద పనులుచేసే పిల్లలనీ ఫోటోలు తీసుకోవాలని కొండంత ఆశతో వచ్చాడు. అతడెన్ని విధాల ప్రయత్నించినా సఫలముకాలేదు. అక్కడికీ అతడు వివరించి చెప్పాడు-వాళ్ళను మోసము చేయటానికి రాలేదనీ, ఫోటోలు తీసుకొనేవరకు ఒక అయిదు నిమిషాలపాటు కుదురుగా కూర్చుని తనవైపు చూస్తే చాలనీ ఎంతో ప్రాధేయ పడ్డాడు. పోనీ-అనాడు కాకపోయిన మరి నాలుగుదినాల తరువాతనయినాసరే నన్నాడు.

కాని ఆ గూడెపువాళ్ళకు సంశయనివారణ కాలేదు. అతడికి తమ చిత్రా లెందుకు? ఊళ్ళో మంచి మంచి మేడలు ఉండగా-కూలటానికి సిద్ధముగా ఉన్న

తమ గుడిసెలే కావాలా ఫోటో తీసుకోవటానికి? కడుపునిండాతిని-కంటికింపుగా అలంకరించుకొని తిరిగే అంతప్రజ ఉండగా-గంజినీళ్ళతో కడుపునింపుకొని పాత చింపులు కట్టుకొనే పేదవాళ్ళకు ఫోటో తీస్తానంటాడేమిటి? అని వాళ్ళకు ఆశ్చ ర్యము కలిగింది. ఆ ఆశ్చర్యములో సందేహము కలిగింది- తమ ఫొటోలను అతడు ఏంచేసుకుంటాడా అని.

అతడు రెండవసారి వచ్చినప్పుడూ అట్లాగే అయింది - వాళ్ళకు అను మానము తీరలేదు; ఆలోచనలు తెగలేదు. 'ఆలోచించుకొనిచెప్తాము-రెండురోజులు తాళి రమ్మ'న్నాడు వీరన్న ఆ గూడానికల్లా కాస్త ధైర్యముతో కొత్తవాళ్ళతో మాట్లాడగల శక్తి గలవాడు కనుక. మనసులో ఎంత నిరుత్సాహము కలిగినా పైకి కనబడనీయకుండా మ. స. క. తలవంచుకొని తిరిగి పోవలసి వచ్చినది.

అతడు కొంతదూరము వెళ్ళిన తరువాత 'ఆ బాబునట్లా తిప్పుతున్నావేం?' అన్న మాటలు వినబడ్డాయి. వెనక్కు తిరిగి చూశాడు. ఆ పడుచు బంతి పూలకొప్పు దమ్మిడీకాసంత గులాబీ కుంకుమ బొట్టూ అతడికి అంతదూరానికి కూడా కనబడే టట్టుగా ఉన్నాయి. నడుముమీద చెయ్యిపెట్టుకొని చిలిపికళ్ళతో గుచ్చి గుచ్చి అడుగుతున్నది.

"నీకు తెల్దులే. ఆ బాబుకంటా మన పుటము కావాలంట. అర్చేటోడా-తీర్చే టోడా? మనజోలి ఆ బాబుకెందుకు?" అంటున్నాడు వీరన్న ఆ పడుచును విది లించుకుంటూ.

మ. స. క. వాటిని విననట్టుగానే ఆ గూడెము దాటిపోయాడు. ఎంత నిరు త్సాహము కలిగినా భయము తీరిన తరువాతనైనా ఒప్పుకోకపోతారా అన్న ఆశ మాత్రము అతడిని విడిచిపెట్టలేదు. దేశపు ఆర్థిక సాంఘిక సమస్యలను గురించిన శాస్త్రాలను అతడు బి. యే. చదివేటప్పుడే ఆకళించు కొన్నాడు; క్లాసు తెచ్చు కొన్నాడు. అయితేనేమి అందరూ ఒహో అన్నవారేగాని ఉద్యోగమిచ్చినవారు లేక పోయినారు. అతడి తెలివితేటలను మెచ్చుకొనే వారేగాని సహాయపడినవారు కరు వైనారు. కూనిరాగాలు తీస్తూ రోడ్లమీద ఎంతకాలము గడిపాడో ఎవరికీ పట్టలేదు. ఉన్నట్టుండి అతడు స్వంత ఊరినీ స్వజనులను వదలిపెట్టి నగరము చేరుకున్నాడు. బాల్యమునుండీ అతడికొక అలవాటు ఉండేది. తల్లిమీదగాని అన్నదమ్ములమీదగాని

కోపమువస్తే మాట్లాడకుండా-గదిలోకివెళ్లి వాళ్ళందరి మీద నాలుగు కాగితాలు వ్రాసి తండ్రికి చూపిస్తూ ఉండేవాడు. తనకేదయినా కావలసివస్తే ఇంట్లోఉన్న తండ్రికి పెద్ద పెద్ద ఉత్తరాలు వ్రాసేవాడు. ఆ అలవాటు చొప్పునే యిప్పుడు మ. స. క. గా మారి తారు రోడ్ల మీద తిరుగుతూ చెట్లక్రింద కూర్చుని వ్యాసాలు వ్రాయటము మొదలు పెట్టాడు. అతడి సంకల్పము ఏమిటంటే నిరుపేదల జీవితాలను గురించి సంక్రాంతి పంచికకు ప్రత్యేకవ్యాసము వ్రాయాలని; దానికితోడు రెండుమూడు మంచి ఫోటోలు కూడా ఉంటే మరీ బాగుంటుందని ; చిత్రాలతో కూడా పంపబడిన ఉత్తమమైన వ్యాసాలకు చాలా గిరాకీ ఉన్నదికదా అని ; అలాంటివి రెండు వ్రాస్తే నెలగడిచి పోతుందికదా అని.

వాళ్ల అన్నట్టుగా - రెండురోజుల తరువాత - మ. స. క. ఆ గూడేనికి బయలుదేరాడు. అతడు కంటికి కనబడగానే ఇంతవరకూ వీరన్నతో మాట్లాడు తున్న వాళ్ళందరూ గుడిసెలలోకి జారుకున్నారు. వీరన్న ఒక్కడే నిలబడి ఉన్నాడు. వీరన్నను చూడగానే గూడేనికి పెద్ద అని తెలిసిపోతుంది వాళ్ళందరిలోకీ అతడు స్వచ్ఛంగా మాట్లాడగలవాడు - కాస్త ఒంటినిండా గుడ్డలు కలవాడూను.

మ. స. క. ను చూడగానే వీరన్న చేతులు కట్టుకొని "బాబుగారు మర్చి పోకుండ వచ్చారే! గుడిసెల మీద ఎంత అపేక్ష బాబుగారికి!" అంటూ ఎదు రుగా వచ్చాడు.

"వీరన్నా ! నా మీద మీకు విశ్వాసములేదా ? మీ జీవితాలను చూస్తుంటే నా హృదయము బ్రద్ధలై పోతున్నది. నా రక్తము కరడు కట్టుకొని పోతున్నది. ఊరిబయట - మురికి గుంటల పక్కన ఉన్న ఈ గుడిసెల్లో తోటిమానవులు కడు పుకు తిండిలేక, ఒంటికి గుడ్డలేక గాలికి బ్రతుకుతూ ఉంటే హృదయము గలవాడు చూసి ఊరుకోగలడా ? మీ జీవితాలను గురించి పత్రికలకు వ్రాయాలనుకుంటు న్నాను. బొమ్మలు కూడా ఉంటే కళ్లకు కట్టినట్లుగా ఉంటుంది. ఆడవాళ్లకు మగ వాళ్లకు పిల్లలకు ఫోటోలు తీస్తానన్నది ఇందుకే. నేను వీటికోసమే వస్తున్నాను. పాపం - మీవాళ్ళ కందరికీ నన్నుచూస్తే భయంగా ఉన్నట్టుంది ! నేను రాగానే పారిపోతున్నారు" అన్నాడు మ. స. క. చెమట తుడుచుకుంటూ.

వీరన్న తలపంకిస్తు "అట్లాగా !" అన్నాడు. "బాబుగారు ఏదోపనిమీదే

వస్తున్నారని అనుకున్నాను. వాళ్ళందరూ వట్టి పిరికివాళ్ళు. భయంకొద్దీ పారిపోతున్నారు" అన్నాడు తాను వాళ్ళకంటె ధైర్యశాలి అని చెప్పలేక.

"వీరన్నా! వాళ్ళకు ధైర్యముచెప్పి బయటికి తీసుకురా" అన్నాడు మ. స క. వినయ పూర్వకముగా.

వీరన్న ముఖము అంతలోకే మారిపోయింది. లేని గాంభీర్యము తెచ్చుకుంటూ "మా గుడిసెల్లో ఇట్టాటిపన్లు నోటి మాటలతో కుదరవు బాబూ! ఆళ్ళందరూ తిండికిలేనోళ్లు, తలకొక పావలా చేతిలోపెట్టితే వస్తారు" అన్నాడు నిర్లక్ష్యంగా అటు తిరిగి.

"అదికాదోయి! నేను వాళ్ళనేమన్నా కష్టపడ మంటున్నానా? అయిదు నిమిషాలసేపు ఇక్కడ - ఈ చెట్టునీడన - నిలబడితే చాలు" అన్నాడు.

"అయినా అట్టా అడిగితే పనికాదుబాబూ! పైన కనబడితేగాని పని జరుగదు" అన్నాడు వీరన్న నిక్కచ్చిగా.

మ. స. క. ఎంతసేపు బ్రతిమిలాడినా వీరన్న దిగి రాలేదు. గత్యంతరము లేక అతడు జేబులోనుంచి మూడు రూపాయలు తీసి వీరన్న చేతిలోపెట్టి "ఇప్పుడయినా పిలుచుకొని వస్తావా?" అన్నాడు వీరన్న ముఖములోకి చూస్తూ.

"చిత్తము చిత్తము" అంటూ వీరన్న గుడిసెలలో ఉన్న వాళ్ళందరినీ కేకపెట్టి పిలిచాడు. అందరూ బయటికి వచ్చారు. రంగులువేసి అమ్మిన పాతబట్టలను కొనుక్కున్నట్టున్నారు - అవి కట్టుకొని సవరించుకొంటూ నిలబడ్డారు వరసగా.

వాళ్ళను చూడగానే మ. స. క. కనుబొమలు ముడిపడ్డాయి. తల అడ్డముగా తిప్పుతూ "నాకు కావలసింది ఇటువంటి వేషాలు కావు! మీరు ఉన్నవాళ్ళు ఉన్నట్టుగా రావాలి. పిల్లలకు పాలు లేకపోతే - మీకు తిండిలేకపోతే ఎట్లా ఉంటారో అట్లా కనబడాలి. మీరంతా రోజూ ఇటువంటి బట్టలే కట్టుకుంటారా?" అన్నాడు ఆవేశముతో.

అతడన్నది వాళ్ళకు అర్థము కాలేదు. అందరూ తెల్లబోయి చూస్తున్నారు. వీరన్న మాత్రము "అయితే యిప్పుడు కాదులెండి బాబుగారూ! నిదానంగా చూతాంలెండి" అంటూ నిర్లక్ష్యముగా వెనక్కు తిరిగాడు.

వీరన్న నిర్లక్ష్యానికి మ. స. క. కు ఆశ్చర్యము కలిగింది. అతడికెందుకో వీరన్నమీద అనుమానము కూడా కలిగింది. ఆ గుడిసెలలో ఉన్నవాళ్ళందరూ ఇతడిచేతి కీలుబొమ్మలని తెలిసికొన్నాడు. కాస్త నిదానము తెచ్చుకొంటూ "వీరన్నా ! ఇది ఏమంత కష్టమైనదని నన్ను అంతగా తిప్పుతున్నారు?" అన్నాడు.

తనసంగతి మరొకసారి వీరన్నకు విపులంగా చెప్పాడు మ. స. క. తన పని ఎట్లాగయినా అయేటట్టు చూడమని బ్రతిమిలాడు కున్నాడు. వీరన్న నవ్వుతూ "ఆళ్ళు ఎవరూ దానికి ఒప్పుకోరు" అన్నాడు, ఎప్పటి మాదిరిగానే పెదవులను బిగిస్తూ.

మ. స. క. కు ఏంచేయాలో తోచలేదు. వ్యాసము పంపవలసిన గడువు దగ్గరికి వచ్చింది. గుడిసెలలో వాళ్ళేకదా ఎంతసేపు ఫోటో తీయాలనుకుంటే తీరా జరిగింది ఇది !

తుది ప్రయత్నముగా మ. స. క. వీరన్న భుజంమీద చేయివేస్తూ "వీరన్నా ! ఈ పని ఏవిధముగానన్నా అయేటట్టు నీవే చూడాలి." అంటూ జేబులో నుంచి అయిదు రూపాయల కాగితాన్ని తీసి అతడి చేతిలో పెట్టాడు.

వీరన్న ఆ కాగితాన్ని చూడనట్టే నలిపి "బాబుగారికి పేదవాళ్ళమీద యెంత ఆపేక్షో !" అంటూ వాళ్ళనందరినీ చాటుకు పిలిచి గుసగుస లాడాడు. అందరి చేతుల్లో ఒక్కొక్క బేడకాసు పెట్టాడు. దానికే వాళ్ళెంత సంతోషపడ్డదీ వీరన్న గ్రహించి తాను కాస్త తొందర పడ్డానను కున్నాడు.

మ. స క. పిల్లలను పెద్దలను తనకు కావలసిన విధంగా ఫోటోలు తీసు కున్నాడు. తన వ్యాసముతో పాటు ఈ చిత్రాలను కూడా పత్రికకు పంపాడు. వాటి నందుకొన్న సంపాదకుడికి ఎంత ఆనందము కలిగిందో - వెంటనే ఒక పెద్ద ఉత్తరము మ. స. క. పేర వ్రాశాడు. ఇక ముందునుంచీ అతడి వ్యాసాలకు ప్రతి ఫలము ఎక్కువ చేస్తునట్టుగా.